క్లుప్తంగా

రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న అర్చకుడు శ్రీనివాసులు

మనుబోలు : మండల కేంద్రంలోని పోలేరమ్మ దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే మహాచండి హోమానికి భగవాన్ వెంకయ్యస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు గంధళ్ల శ్రీనివాసులు సోమవారం రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. అక్టోబర్ 19వ తేదీన జరిగే మహాచండి హోమం, అన్నదాన కార్యక్రమాలకు ఈ విరాళాన్ని వినియోగిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

ఊరెళ్లి బీమా నగదు అందజేత



కొడవలూరు : నార్తురాజుపాళెం సచివాలయం -2 పరిధిలో నివాసముంటున్న అద్దంకి అంజయ్య సోమవారం హఠాన్మరణం చెందగా, ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇందుకూరుపేట మండలం గంగపట్నానికి తీసుకెళ్లారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం వైఎస్సార్ బీమా ద్వారా చెల్లించాల్సిన రూ.10 వేలను స్థానిక వలంటీర్లు గంగపట్నం వెళ్లి అంజయ్య కుటుంబసభ్యులకు అందజేశారు. నగదు అందజేసిన వలంటీర్లలో మల్లికా ప్రసాద్, ముఖేష్, ప్రసన్న, రాకేష్ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

బుచ్చిరెడ్డిపాళెం: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వంశీధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని బీజేపీ నేత రోశిరెడ్డి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీని సమర్థవంతంగా నడిపించేలా నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేస్తానన్నారు. అనంతరం ఆయన్ను మండల బీజేపీ నేతలు సన్మానించారు. బీజేపీ మండలాధ్యక్షుడు రఘురామయ్య, నాయకులు రాధాకృష్ణగౌడ్, పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

22న నాలుగో విడత ఐటీఐ కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 22న స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ గర్ల్స్ ఐటీఐలో నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రజియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 20న తమ ధ్రువీకరణ పత్రాలను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

న్యాయవాది మృతికి సంతాపం

నెల్లూరు(లీగల్): సీనియర్ న్యాయవాది ఎం.శ్రీనివాసులు మృతికి పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు హాలులో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని అధ్యక్షతన ఈ సంతాప సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మృతిచెందిన న్యాయవాది శ్రీనివాసులు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య, కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మందుల విక్రయాల్లో జాగ్రత్తలు అవసరం

నెల్లూరు(సెంట్రల్): మందులు, నార్కొటిక్ డ్రగ్స్ విక్రయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా డ్రగ్స్ అధికారి వీరకుమార్ రెడ్డి అన్నారు. మందుల విక్రయాలపై 'ద నెల్లూరు డిస్ట్రిక్ట్ హోల్‌సేల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్' ఆధ్వర్యంలో నెల్లూరులోని హోల్‌సేల్ మెడికల్ భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తి పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. రూరల్ పోలీసులు, స్థానికుల కథనం మేరకు ధనలక్ష్మీపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అనిల్ కదిర్‌రెడ్డి తన సైకిల్‌పై వెళ్తుండగా నెల్లూరు వైపు నుంచి ముత్తుకూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో సైకిల్ నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. సోమవారం రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో వారు ఆస్పత్రికి చేరుకుని విచారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేపల్లిని నంబర్-1గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



శ్మశానవాటిక ప్రహరీని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రాష్ట్రంలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని నంబర్-1గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలో రూ.40.70 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీ, రూ.41.50 లక్షలతో నిర్మించిన అంతర్గత సైడు కాలువలను మంత్రి కాకాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో ఊహకందని అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు. గ్రామాల్లో మట్టిరోడ్లు కనిపించని విధంగా సీసీరోడ్లను నిర్మించామన్నారు. అలాగే సైడు కాలువలు, తాగునీటి సరఫరాకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయించామన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి స్థలంతో పాటు, ఇంటిని నిర్మిస్తున్నామన్నారు. రెండు దఫాలు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఎంపీడీఓ వెంకటరమేష్, తహసీల్దార్ కృష్ణ, వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ నేతలు వేమారెడ్డి రఘునందన్ రెడ్డి, ఉప్పు రాఘవేంద్ర, ప్రసాద్, ఉప్పు అశోక్, సురేష్, వెంకటేశ్వర్లు, హరిబాబు పాల్గొన్నారు.

సర్వేపల్లికి పట్టిన గ్రహణం సోమిరెడ్డి

సర్వేపల్లి నియోజకవర్గానికి పట్టిన గ్రహణం సోమిరెడ్డి అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో వెంకటాచలం, కసుమూరు గ్రామాలకు చెందిన 150 టీడీపీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. ముందుగా గొలగమూడి క్రాస్‌రోడ్డు నుంచి వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. గజమాలతో మంత్రి కాకాణిని సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటాచలంలో మంత్రి కాకాణి మాట్లాడుతూ సర్వేపల్లిలో ప్రజలకు సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధి జరగకుండా అడ్డుకునేందుకు సోమిరెడ్డి కుట్రలు చేయడం సిగ్గుచేటన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మూడు దఫాలుగా పనిచేసిన సోమిరెడ్డి ఏం అభివృద్ధి చేశాడో సమాధానం చెప్పాలన్నారు. తన హయంలో జరిగిన అభివృద్ధిలో కనీసం సగమైనా చేశాడో చెప్పేందుకు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నా, కాలువలను అభివృద్ధి చేస్తున్నా వాటినీ అడ్డుకునే కుట్రలు చేయడం సిగ్గు చేటన్నారు. నా జీవితంలో సోమిరెడ్డి లాంటి వ్యక్తిని చూడలేదన్నారు. అభివృద్ధిని అడ్డుకునే సోమిరెడ్డికి వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కదన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చీకుర్తి నరసయ్య, కడివేటి శివ, హుస్సేన్, గుర్రం పుట్టయ్య, మందా కృష్ణ, వెలిబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వెంకటాచలంలో భారీ బైక్ ర్యాలీ

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు) : మండలంలోని రామతీర్థం పంచాయతీ పరిధిలో 2021లో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన సాలి వెంకమ్మ, రామచంద్రాపురం మాజీ సర్పంచ్ సాల్మన్‌రాజ్ వారి అనుచరులతో టీడీపీని వీడి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. విడవలూరు మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరే వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, ఎంపీపీ భవానమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ నవీన్‌రెడ్డి, నాయకులు భానురెడ్డి, ఓగు నాగేశ్వరరావు, తిరుపతి, వాసు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య జీవనం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

కొడవలూరు : పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని దక్షిణ గండవరం మజరా తలారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహార పదార్థాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అదేవిధంగా మార్కెట్‌లో తక్కువ ధరలకు లభ్యమయ్యే ఆకుకూరలు, చిరు ధాన్యాల్లో కూడా పోషకాలుంటాయని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అమరావతి పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలు



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలున్నాయని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరు దర్గా సంఘంలో నూతనంగా నిర్మించుకున్న ఇంకుడు గుంతలను హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంట్లోని మురుగునీటిని రోడ్లపై వదలకుండా ఇంకుడు గుంతలు ఉపయోగపడుతాయన్నారు. అంతేకాకుండా భూగర్భ జలాలను సంరక్షించుకునేందుకు ఉపకరిస్తుందని చెప్పారు. వీటి నిర్మాణానికి ఉపాధి హామీ ద్వారా రూ.6 వేలు ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ, ఎఫ్ఏ కె.రమేష్ ఉన్నారు.

ట్రస్ట్ ద్వారా అండగా నిలుస్తాం



చిన్నారుల నృత్య ప్రదర్శన

మనుబోలు : కష్టాల్లో ఉన్న వారికి తమ ట్రస్ట్ ద్వారా అండగా నిలుస్తామని సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మడమనూరులో గ్రామస్తుల కోరిక మేరకు ట్రస్ట్ ద్వారా రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన రచ్చబండను ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ప్రయత్నంలో తన వంతు సాయం అందజేస్తామన్నారు. కాగా రచ్చబండ ప్రారంభం సందర్భంగా స్థానిక చిన్నారులు కందల సుస్మిత, చేవూరు పావని, పృథ్వీ పౌర్ణమిల నృత్య ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. అనంతరం ముగ్గురు బాలికలకు పారసన్మానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, గ్రామ పెద్దలు అజయ్‌రెడ్డి, రామయ్య, లక్ష్మయ్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

16లోగా జాబితాను సరిచేయండి

- స్పెషల్ కలెక్టర్ ఓబులేసు



మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్

మనుబోలు : ఈనెల 16వ తేదీలోగా ఓటర్ల జాబితాలో మార్పు చేర్పులను పూర్తి చేసి తప్పులను సరిచేయాలని స్పెషల్ కలెక్టర్ ఓబులేసు బీఎల్వోలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో నియోజకవర్గంలో మనుబోలు మండలం వెనుకబడి ఉందని, ఇకనైనా బీఎల్వోలు చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలు, సూచనల ప్రకారం జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, డీటీ శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

13 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్



మనుబోలు : పీడీలతో మాట్లాడుతున్న ఎంఈఓ

మనుబోలు : ఈనెల 13వ తేదీ నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభమవుతాయని ఎంఈఓ రమేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పాఠశాలల పీడీలతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అండర్ 14, 17 బాలబాలికలకు ఈనెల 13, 14, 15వ తేదీల్లో మండల స్థాయి పోటీలు, ఈనెల 21, 22, 23వ తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. మండల, జోనల్ స్థాయిలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, యోగా పోటీలు, జిల్లా స్థాయిలో పై పోటీలతో పాటు క్రికెట్, బేస్‌బాల్, రగ్బీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉంటాయన్నారు. అలాగే 15న అండర్-17 బాలబాలికలకు జిల్లా స్థాయిలో హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, హాకి, వాలీబాల్ పోటీలను నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తారని తెలియజేశారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2న సచివాలయ స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో 17 ఏళ్లు పైబడిన వారు పాల్గొన వచ్చన్నారు. ఆయనతో పాటు పీడీలు ప్రమీలరాణి, సరిత, కామాక్షి, మధుసూదన్‌రావు ఉన్నారు.

దొడ్ల సుబ్బారెడ్డి జెడ్పీహైస్కూల్లో ఎంపికలు

పొదలకూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా ఎంపికలు ఈనెల 13, 14వ తేదీల్లో పొదలకూరు మండలం మహ్మదాపురం దొడ్ల సుబ్బారెడ్డి జెడ్పీహైస్కూల్లో నిర్వహిస్తామని సర్వేపల్లి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో–ఆర్డినేటర్, పీడీ విజయవిశ్వేశ్వరన్ సోమవారం తెలిపారు. ఈ ఎంపికలో అండ్–14, 17 విభాగాలకు 13వతేదీ అథ్లెటిక్స్(ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్), 14న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్ టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. ఈ ప్రక్రియలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఎంఈఓ శేషాద్రివాసు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామకృష్ణయ్య, పొదలకూరు జెడ్పీహైస్కూల్ హెచ్ఎం సనత్‌కుమార్ పాల్గొంటారన్నారు.

నేడు ఎడమకాలువ పరిశీలన

పొదలకూరు : కండలేరు ఎడమగట్టు కాలువను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు పరిశీలిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి సోమవారం తెలిపారు. పొదలకూరు-సంగం మార్గంలో ఉన్న కాలువ వద్ద నుంచి జీరో పాయింట్ వరకు కాలువను పరిశీలించి ఎత్తిపోతల పథకం వద్దకు చేరుకుని పంప్ హౌస్‌ను తనిఖీ చేస్తారన్నారు.

8 మందిపై కేసు నమోదు

పొదలకూరు : పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉండగా ప్రజా జీవనానికి ఆటంకం కలిగించే విధంగా రోడ్డుపై బైఠాయించిన తెలుగుదేశం పార్టీకి చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే కరిముల్లా సోమవారం తెలిపారు. బైఠాయించిన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ కె.వీరవసంతరావు నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు వినతులను అందజేశారు. పాసు పుస్తకాలు, భూవివాదాలు, భూముల సర్వే తదితర సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎగబాకిన నిమ్మధరలు



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

- బస్తా నిమ్మకాయలు రూ.5,500
- దిగుబడి లేక ఎగబాకిన ధరలు

పొదలకూరు : సాధారణంగా సెప్టెంబర్ మాసంలో నిమ్మకాయలను అడిగే వారుండరు. అయితే స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో నాణ్యత కలిగిన బస్తా(లూజు) నిమ్మకాయలు రూ.3,200 నుంచి రూ.5,500 వరకు(కిలో రూ.40 నుంచి రూ.70 వరకు) ధర పలుకుతోంది. ఈ ఏడాది నిమ్మరైతులకు ఆశించిన స్థాయిలో ధరలు లభించలేదు. ఈ ప్రాంత రైతులు నిమ్మ మీదే ఆధారపడి జీవిస్తుంటారు. ఇతర పంటలేవీ ఆశించిన స్థాయిలో దిగుబడి ఉండదు. రబీ సీజన్లో వరి సాగు చేసే రైతులు ఆ తర్వాత నిమ్మ, పత్తి, మినుము, పెసర పంటల సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. కాగా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో కాయల దిగుబడి ఆశించిన స్థాయిలో ఉన్నా గిట్టుబాటు ధరలు లభించలేదు. ప్రస్తుతం నిమ్మతోటలకు నీటి ఇబ్బందులు లేకపోవడం వల్ల ఖర్చులు బాగా తగ్గిపోయాయి. ప్రభుత్వం కూడా సూక్ష్మసేద్యం కింద డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు రాయితీని పునరుద్ధరించడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం తోటల్లో స్వల్పంగానే కాయలు ఉన్నట్లు రైతులు వెల్లడించారు.

కాయలు లేకనే ధరలు



తోటల్లో నిమ్మకాయలు లేకపోవడం వల్లనే ధరలు ఎగబాకుతున్నాయి. సెప్టెంబర్ మాసంలో ఈ స్థాయిలో ధరలు పలికింది లేదు. ఈ ఏడాది నిమ్మకాయల ద్వారా అటు రైతులు, ఇటు వ్యాపారులు ఆశించిన స్థాయిలో లాభాలు ఆర్జించకున్నా, ప్రస్తుతం కాయలు ఉన్న రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మమార్కెట్‌యార్డు

టీడీపీ బంద్ ఊసే లేదు

- యథావిధిగా వాహన రాకపోకలు
- కొనసాగిన వ్యాపారాలు



కళకళలాడుతున్న ముత్తుకూరు బజారు సెంటర్

ముత్తుకూరు : ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా సోమవారం టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపునకు స్పందన కరువైంది. మాజీ మంత్రి సోమిరెడ్డి ఇన్‌చార్జిగా ఉన్న సర్వేపల్లి నియోజకవర్గంలో బంద్ చేసేందుకు టీడీపీ శ్రేణులు ముందుకు రాకపోవడం విశేషంగా చెప్పుకొంటున్నారు. కాగా ముత్తుకూరు మండలంలో యథావిధిగా బస్సులు, వాహనాలు తిరిగాయి. ఎప్పటిలాగే బజారు సెంటర్‌లో రద్దీ కొనసాగింది. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు ఎప్పటిలాగే పనిచేశాయి.

- **మనుబోలు** : మనుబోలు మండల కేంద్రంలో టీడీపీ బంద్ పెద్దగా కనిపించలేదు. స్థానిక టీడీపీ ముఖ్య నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 12 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ సంగమేశ్వరరావు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి. వాహన రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలుగలేదు. దుకాణాలను తెరిచే ఉంచారు.
- **కొడవలూరు** : కొడవలూరు మండలంలో బంద్ ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు, బ్యాంక్‌లు, దుకాణాలు యథావిధిగా నడిచాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు కూడా ఎప్పటిలానే రాకపోకలు సాగించడంతో ప్రజల రోజువారీ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడలేదు.
- **పొదలకూరు** : టీడీపీ బంద్‌కు పొదలకూరులో ఎలాంటి స్పందన లభించలేదు. పట్టణంలో యథాతథంగా కార్యకలాపాలు కొనసాగాయి. ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలలు నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సీఐ జి.సంగమేశ్వరరావు, ఎస్సై కరిముల్లా పట్టణంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఆర్టీసీ బస్సులు, గ్రామాల నుంచి ఆటోల రాకపోకలు ఎప్పటిలానే జరిగాయి. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు బంద్ చేసేందుకు ముందుకు రాలేదు.
- **తోటపల్లిగూడూరు** : మండల పరిధిలో టీడీపీ బంద్ ప్రభావం ఎక్కడా కానరాలేదు. ఎస్సై జంపానికుమార్ తన సిబ్బందితో మండలంలో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. పలువురు టీడీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేయగా, కొందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మొత్తంగా మండలంలో ఎక్కడా బంద్ ఊసే లేదు.

బుచ్చిరెడ్డిపాళెం : మండల పరిధిలో టీడీపీ బంద్ ప్రభావం కనిపించలేదు. నగర పంచాయతీ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా బంద్ చేసేందుకు టీడీపీ కార్యాలయానికి చేరుకున్న తెలుగు తమ్ముళ్లను పోలీసులు ముందస్తుగానే అదుపులోకి తీసుకున్నారు. అయితే బంద్‌కు ప్రజల నుంచి ఎలాంటి మద్దతు లభించకపోవడంతో బస్సుల రాకపోకలు కొనసాగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు జరిగాయి. దుకాణాలు తెరిచే ఉంచడంతో వ్యాపారాలు కొనసాగాయి. సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్ పరిస్థితి పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.



మనుబోలు : వైఎస్సార్ సర్కిల్ వద్ద..



బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



పొదలకూరు బస్టాండ్‌లో..



తోటపల్లిగూడూరు: నరుకూరు సెంటర్‌లో..



బుచ్చిరెడ్డిపాళెం : యథావిధిగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు